క్లుప్తంగా

అండర్-17 జిల్లా క్రికెట్ జట్టులో క్రాంతికుమార్



నిడదవోలు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-17 క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు మండలంలోని పురుషోత్తపల్లి జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి పి.క్రాంతికుమార్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీఎస్‌వీఎస్ ప్రసాద్ శనివారం తెలిపారు. తణుకులో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో క్రాంతికుమార్ ప్రతిభ కనబరిచి, ఎంపికయ్యాడు. త్వరలో నిర్వహించే అండర్-17 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో అతడు ఈ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. క్రాంతికుమార్‌ను పీడీ ఎస్‌టీ రామారావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

డిగ్రీ కళాశాల్లో ఫ్రెషర్స్ డే



వేడుకల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

కొవ్వూరు: విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగపరుచుకుని ఉన్నత స్థాయికి చేరాలని కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత సూచించారు. ఈ కళాశాలలో శనివారం సాయంత్రం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కొత్తగా చేరిన విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి తాము సిద్ధంగా ఉంటామన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సునీతతో పాటు అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

కొవ్వూరు: కార్తిక మాసం సందర్భంగా శనివారం స్థానిక గోష్పాద క్షేత్రంలోని ధర్మ జ్ఞాన కళావేదికపై సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వందలాది భక్తులకు ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. పురుషోత్తమ ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకర శర్మ సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇనగంటి ఉమా రామారావు, కలిగొట్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం భక్తులను తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సొసైటీల అభివృద్ధికి రైతులు సహకరించాలి



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీఆర్ సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు

నిడదవోలు రూరల్: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)ల అభివృద్ధికి రైతులందరూ సహకరించాలని కొవ్వూరు డివిజనల్ సహకార అధికారి కె.సుబ్బారావు కోరారు. మండలంలోని శంకరాపురంలో సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు అధ్యక్షతన శనివారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. డీఆర్ సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావులు సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రైతులంతా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, సూపర్‌వైజర్ పి.శశికాంత్, సెక్రటరీ పి.ప్రకాశరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

పెరవలి: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం పెరవలి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ వంటివి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు కె సూర్యకాంతం, జె. రత్నకుమారి, ఎం. కన్యాకుమారి, సీహెచ్ విశాలి, ఎం.జానికి, ఎస్. రంగనాయకమ్మ, యు.ధనలక్ష్మి, ఎన్. వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్యాభివృద్ధికి టాస్క్‌ఫోర్స్ కమిటీలు

- ఆరుగురితో పంచాయతీల వారీగా ఏర్పాటుకు సన్నాహాలు
- జీఓ -34 విడుదల చేసిన ప్రభుత్వం
- గ్రామీణులకు ఇదొక వైద్య కవచం



అనంతపల్లి వెల్ నెస్ సెంటర్లో వైద్యసేవలు అందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య

నల్లజర్ల: ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా రోగుల ఇంటి వద్దకే వైద్యులు వచ్చి చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పల్లెలకు కూడా వైద్య నిపుణులను తీసుకు వచ్చి ఇక్కడే వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను కూడా ఉచితంగా అందించే ఏర్పాట్లు చేశారు. తాజాగా గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణకు గ్రామ పంచాయతీ స్థాయిలోనే టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే జీఓ నంబర్ 34ను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా అంతటా ఆరోగ్య రంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనకు ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీలు కృషి చేయనున్నాయి. డాక్టరు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ పేదలకు విస్తృత వైద్య సేవలు అందించేందుకు ఈ సరికొత్త విధానానికి రూపకల్పన చేశారు.

ఆరుగురు సభ్యులతో కమిటీ

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఆరోగ్య రంగంలో సుస్థిరాభివృద్ధి (ఎస్‌డీజీ) సాధన కోసం ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తారు. ప్రతి గ్రామంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, అర్హత గలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్-ఎంఎల్‌హెచ్‌ఓ)ను ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీకి లీడర్‌గా నియమిస్తారు. ఈ కమిటీలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, అంగన్‌వాడీ టీచరు, స్కూల్ హెల్త్ అంబాసిడర్, ఆ పంచాయతీలోని ఒక డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు సభ్యులుగా ఉంటారు. వీరందరూ ఆయా గ్రామాల్లోని గర్భిణులు, బాలింతల రక్తహీనతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. అలాగే పిల్లల ఆరోగ్యం, జీవనశైలి, వ్యాధుల నిర్ధారణ-నివారణ తదితర అంశాలపై ఎప్పటికపుడు కమిటీ లీడర్‌కు సమాచారం అందిస్తారు. కౌమార దశలోని బాలికలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల్లో రక్తహీనతను గుర్తించి డాక్టరు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో సమన్వయం చేసుకొని అలాంటి వారికి ఐఎఫ్‌ఏ మాత్రలు పంపిణీ చేస్తారు. యుక్త వయసు బాలికలకు శానిటరీ నాప్కిన్స్ సరఫరా, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా క్రమం తప్పకుండా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తారు.

రక్తహీనతపై పర్యవేక్షణ

ప్రసవానికి ముందు, తర్వాత గర్భిణుల సంరక్షణ, నులి పురుగుల నివారణ మందులు పంపిణీ, పిల్లల ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటారు. గ్రామాల్లో జరిగే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ లీడర్ విధిగా హాజరు కావాలి. గ్రూపు సభ్యులు తమ నివాస ప్రాంతాల్లో ఎవరికైనా ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే కమిటీకి తెలియజేస్తారు. గ్రూపు సభ్యులకు ఆయా ప్రాంతాల వారి జీవనశైలిని బట్టి వ్యాధుల నివారణ, పరీక్షలు, చికిత్స, ఇతర సమస్యలపై అవగాహన కల్గిస్తారు.

- ప్రసవానికి ముందు యాంటినేటల్ పరీక్షల సమయంలో యూఎస్‌జీ స్కానింగ్ ప్రాముఖ్యత, ఇమ్యునైజేషన్‌ద్వారా రోగ నిరోధకశక్తిని పెంపొందించడం
- బాల్య వివాహాల నివారణ ద్వారా యుక్త వయస్సు గర్భాలను నిరోధించడం

-కుటుంబ నియంత్రణ ప్రణాళికను అమలు చేయడం, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూస్తారు.

ప్రజలకు ఎంతో ప్రయోజనం



విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపట్టే కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్ ఎటాక్, క్యాన్సర్, హైపర్ టెన్షన్ తదితరాలపై ప్రజలకు అవగాహన కలుగుతుంది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

– దాక్టరు తెల్లం గంగాధరరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దాక్టరు, నల్లజర్ల

ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం



పంచాయతీల పరిధిలో కొత్తగా ఏర్పాటుచేసే టాస్క్‌ఫోర్స్ కమిటీలతో గ్రామీణులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరనుంది. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.చిన్నచిన్న రుగ్మతలకు కిలోమీటర్ల దూరం వెళ్లకుండా ఉన్న ఊర్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. ప్రజలకు మరింత మంచి జరుగుతుంది.

–షేక్ జరీనా, హెల్త్ ప్రొవైడర్, దూబచర్ల-1

టెన్త్ తర్వాత ఎంచుకొనే కోర్సే భవిష్యత్తుకు కీలకం



అనంతపల్లి హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తాడేపల్లి మోహనరావు

నల్లజర్ల: తమ శక్తిసామర్థ్యాలను అంచనా వేసుకొని పదో తరగతి తర్వాత సరైన కోర్సులను ఎంచుకోవడం ప్రతి విద్యార్థికీ కీలకమని మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు సూచించారు. టెన్త్ విద్యార్థులు పరీక్షలు ఎలా రాయాలి? పాసయ్యాక ఏయే కోర్సులను ఎంచుకోవాలనే విషయాలపై శనివారం ఆయన నల్లజర్ల, దూబచర్ల జెడ్పీ హైస్కూళ్ల టెన్త్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. చాలా తక్కువ మంది మాత్రమే టెన్త్ తర్వాత సైన్సు,మ్యాథ్స్ గ్రూపులను ఎంచుకుంటున్నారన్నారు. మన దేశంలో సైన్సు గ్రాడ్యుయేట్స్‌కే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం వల్లే కోర్సుల ఎంపికలో తప్పిదాలు జరుగుతున్నాయన్నారు. పది తర్వాత తీసుకునే నిర్ణయమే జీవితంలో ఉన్నతిని నిర్ణయిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మానవత సంస్థ మండల శాఖల అధ్యక్షులు ఐడీవీ అప్పారావు, గుళ్ళపూడి వెంకటరత్నం, నాయకులు దావులూరి చిరంజీవి, నందం రాజేంద్రప్రసాద్, భోగవల్లి వెంకట సుబ్బారావు, పాతూరి సత్యనారాయణ, పాల్గొన్నారు.విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

అన్నివర్గాల సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత
- చాగల్లులో మంత్రి , కానూరు అగ్రహారంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ..



చాగల్లులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



కానూరు అగ్రహారంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

చాగల్లు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. శనివారం చాగల్లు -2 సచివాలయం పరిధిలోని వార్డుల్లో ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి వనిత గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తానేటి వనిత మాట్లాడుతూ అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఏ గడపకు వెళ్లినా చిరునవ్వుతో ప్రజలు తమను ఆహ్వానిస్తున్నారని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారని ఆమె అన్నారు. ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల శాఖ గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపీటీసీ సభ్యులు సానబోయిన అర్జునరావు, ఎస్‌కే పాషా, ఉన్నమట్ల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డొస్తే సహించేది లేదు

పెరవలి: గ్రామాల అభివృద్ధికి ఏ పార్టీ వారైనా అడ్డంకిగా మారితే సహించేది లేదని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హెచ్చరించారు. మండలంలోని కానూరు అగ్రహారంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే ఆ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.వేలాది కోట్ల నిధులను ఖర్చు చేస్తోందన్నారు. ఇలాంటి తరుణంలో అభివృద్ధికి విపక్షాలు అడ్డు తగులుతూనే ఉంటాయన్నారు. అలాంటి వారి మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. ఈ గ్రామంలో రూ.కోటి వ్యయంతో వివిధ పనులు చేపట్టామని చెప్పారు. అలాగే అలాగే పలు సంక్షేమ పథకాల ద్వారా ఈ గ్రామ ప్రజలకు సుమారు రూ. 2 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. అయితే కొందరు ఈ గ్రామాభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం మంచి పద్ధతి కాదని శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఏమైనా రాజకీయాలుంటే ఎన్నికల సమయంలో చూసుకోవాలే తప్ప అభివృద్ధి పనుల్లో కాదని హితవు చెప్పారు. ఈ ప్రభుత్వం ఒకరికి మేలు చేస్తుందే తప్ప అన్యాయం చేయదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు బీరా రాజు, సర్పంచ్ దాసం వెంకన్న, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసం బాపన్న (బుజ్జి) వివిధ శాఖల అధికారులు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నవరప్పాడుకు పోటెత్తిన భక్తులు



వేంకటేశ్వరస్వామి వారు

పెరవలి: కార్తిక శనివారం కావడంతో అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో అలంకరించారు. వేకువజామునే పెద్ద ఎత్తున మహిళా భక్తులు తరలి వచ్చి, ఆలయం వద్ద గల కోనేరులో కార్తిక దీపాలు వదిలారు. స్వామి వారికి అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం ఏడు గంటల తరువాత భక్తుల రద్దీ మరింతగా పెరిగింది. దాంతో స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి అన్న సమారాధాన నిర్వహించారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

మంజూరైన పనులు త్వరగా పూర్తిచేయండి

- అధికారులకు ఎంపీపీ భాగ్యలక్ష్మి సూచన
- నిడదవోలు మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి

నిడదవోలు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో మండల పరిషత్, జెడ్పీ సాధారణ నిధులతో పాటు ఉపాధి హామీ పథకంలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. నిడదవోలు మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని శనివారం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలను డిసెంబర్ 10వ తేదీ లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకల నిర్మాణం, పైపులైన్లు, కుళాయిల పనులను సంక్రాంతికి పూర్తి చేసేలా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు చర్యలు తీసుకున్నారని ఆమె చెప్పారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు అండగా ఉండాలని అధికారులను కోరారు. గ్రామీణ వైద్యానికి ప్రాధాన్యం కల్పిస్తూ మండలంలోని 15 గ్రామాల్లో చేపట్టిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.41.80 లక్షలు మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. అలాగే సమిశ్రగూడెంలోని ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం, అభివృద్ధికి రూ.4 లక్షలు మంజూరు చేస్తూ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు వడల రత్నకుమారి, కానుబోయిన ప్రభావతి, ఎంపీడీఓ పి.శామ్యూల్, కార్యాలయ ఏఓ రత్నరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగరాజుపాలెం చెరువుపై వంతెన నిర్మించాలి



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న ఎంపీటీసీ పావనీకుమారి, పరమేశ్వరరావు

నల్లజర్ల: మండలంలోని సింగరాజుపాలెం గ్రామ ముఖద్వారం వద్ద గల చెరువుకు వంతెన నిర్మించాలని ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి,వైఎస్సార్ సీపీ నాయకుడు పరమేశ్వరరావు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. అడవి నుంచి వచ్చే వాగుల నీటితో వర్షాకాలంలో ఈ చెరువు మీదుగా గ్రామానికి రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులకు ఇబ్బంది కలుగుతోందని వారు వివరించారు. ఈ సమస్యను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను సీఎం జగన్ ఆదేశించినట్టు వారిద్దరూ తెలిపారు.

ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు ఏర్పాట్లు

నిడదవోలు రూరల్: భారత్- ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో జరిగే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నిడదవోలు మండలంలోని వివిధ గ్రామాల్లో యువత ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సమిశ్రగూడెం, పురుషోత్తపల్లి, కోరుమామిడితో పాటు పలు గ్రామాల్లోని ప్రధాన సెంటర్లలో భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఫైనల్‌లో భారత్ జట్టు విశ్వవిజేతగా నిలవాలని క్రికెట్ అభిమానులు ఆశిస్తున్నారు.

సెపక్ తక్రా పోటీల్లో సత్తా చాటిన బాలికలు

- జాతీయ స్థాయి పోటీలకు చిన్నాయగూడెం విద్యార్థిని దుర్గ మధురశ్రీ



రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో సత్తా చాటిన చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

దేవరపల్లి: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్) సెపక్ తక్రా పోటీల్లో మండలంలోని చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈ నెల 10 నుంచి 12 వరకూ విజయవాడలోని పడమర హైస్కూల్ మైదానంలో 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17,19 విభాగాల్లో బాలికల సెపక్‌తక్రా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు తరఫున ఈ పోటీల్లో పాల్గొన్న చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు అత్యంత ప్రతిభ చూపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఓవరాల్‌గా ద్వితీయస్థానం సాధించాయి. అండర్ -14 విభాగంలో పాకా దుర్గమధురశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.ఆమె డిసెంబర్ 20 నుంచి 24 వరకూ ఢిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీల్లో రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అండర్- 14 విభాగంలో జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్టు పీడీ అల్లాభక్షు తెలిపారు. అండర్ -17 విభాగంలో కె.మానస, అండర్ -19 విభాగంలో కాసాని అనూష, యివ్వల కిరణ్మయి సత్తా చాటారు. వారిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నల్లా హెప్సీబా, ఉపాధ్యాయులు అభినందిచారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు పోటీలు

చాగల్లు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొవ్వూరు డివిజన్‌లోని పలు గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. చాగల్లు శాఖా గ్రంథాలయంలో శనివారం గేయాల పోటీలు నిర్వహించారు. దేశభక్తి, పద్య గేయాల పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

తాళ్ళపూడి: తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పశు వైద్యాధికారి సీహెచ్ బాలాజీ గ్రంథాలయాల గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి ఎ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత, మొబైల్ వాడకంపై వాటి ప్రభావం అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐదో వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ పర్యవేక్షించారు.

ఉండ్రాజవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ గుత్తికొండ కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. జూనియర్స్‌కు నైతిక విద్య ప్రాధాన్యతపై, సీనియర్స్‌కు విద్యావిధానంలో సాంకేతిక ప్రగతి అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు.

పెరవలి: ముక్కామల, పెరవలి, తీపర్రు గ్రంథాలయాల్లో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, కబడ్డీ, రన్నింగ్, వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కరుటూరి విశ్వనాథం, పీసపాటి వెంకటేశ్వర్లు, సలాది సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.